# మాటలేనా!!

భమిడిపాటి కామేశ్వరరావు

పాతపట్నం సివారు పెరుగుపిల్లి అనే ఒక జమీాందారీ గ్రామం ఉండేది. ఆవూళ్లో సిమాలమ్మ అనే ఒకవ్యక్తి ఉండేది. మొదణ్ణించీ ఆవిడ అక్కడే ఉంది. ఆవిడ పుట్టింటారంతా బుగ్గి అయిపోడం, మాటలు ఇంకా సరిగ్గారాని వయస్సులోనే ఆవిడికి అత్తారింటే పెళ్లవడం, పెళ్లైన పదహారోపండగ ఇదవకుండానే ఆవిడఐదోతనం కాస్తా అస్తాయిస్తయిపోవడంలాంటివి కుట్ర జరిగినట్టు జరిగిపోయాయి. మాటొచ్చినప్పుడు పేరంటాళ్లు "సిమాలమ్మ ఎంత దొడ్డది! అయితేం పెట్టిపుట్టద్దూ! బొట్టుపెట్టీ, కాటికక్కాయా ఎరగదుకదా!" అంటూ కళ్లు తుడుచుగునేవారు. అత్తమామలకి ఇతరసంతతి లేకపోవట్టి, ఆవిడ అత్తారింటికి వెళ్లినవెళ్లడం ఏకవెళ్లడం అయిపోయి, అక్కడే పాతుగుపోవలిసొచ్చింది. ఆవిడికి పాతికేళ్లు వచ్చేదాకా అత్తగారుగ్రహం, ఏసాదింపో సాదిస్తూ, విగ్రహం కంటికి కనపడుతూ ఉండేది. మరి తరవాత ఇహ ఎవరున్నారూ! బిక్కు-బిక్కుమంటూ కార్తీకదీపంలాగ మామగారొక్కడూను! ఆకాస్తమామగారూకూడా వచ్చేప్రాణం పోయేప్రాణంకింద మంచంమీాద పణ్ణర్ధం ఉయ్యాలా ఊగి, ఆవిడ ముప్ఫయ్యోయేట బ్రహ్మాండంమీాద పోయాడు. అప్పణ్ణించి, ఆవిడ, అటూ ఎవరూలేక ఇటూ ఎవరూలేక ఘుంటస్తంభంలాగ ఒక్కర్తీ నిల్చిపోయింది. బతికున్న జ్ఞాతులు ఎవరూ లేకపోడంచేత వారసత్వపు గొడవలు ఆవిడచెవిని పడవలసిన అవసరం పోయింది. ఆవిడ పెంచుకోనూ లేదు. ఏటా ఓ ఇరవై కాటాబస్తాధాన్యం, ఓబొద్దుగడ్డీ, గుమ్మంలోకి తెచ్చి ఆవిడకాళ్లదగ్గర అప్పగించేవారు. ఆవిడదగ్గర రెండువేలు చేసే బంగారపుతొడుగుండేది. ఆవిడపేర రెండువేలపైమాట వడ్డీకి తిరుగుతూండేది. ఆవిడికి పట్టుమని బంధువులేనా లేరు, ఏబీరకాయి పీచో! ఆవిడ ఇంటిపేరుకి నోట్లల్లోనూ పత్రాల్లోనూ తప్ప వాడకమే లేదు. దానిమూలాన్ని ఆవిడికి పురుడుపుణ్యాలూ, కష్టసుఖాలకి రాకపోకలూలాంటి కుటుంబసంబంధమైన తప్పనిసరి మొహమాటపు తగులుబాట్లు కించిన్మాత్రం లేకుండాపోయాయి. ఆవిడికి గవ్వ ఖర్చులేదు. అందులోనూ ఆవిడ స్వతహా ఇరుకుచేతి మనిషి. అవునా! తను దంతసిరితో పుట్టిందగదా, ఇంత అన్నోదకాలకి మొహం వాయక్కర్లేదుగదా, ఒహాటోరకమైన వసతి కట్టుదిట్టంగా ఖంజాయింపై ఉందిగదా, చెయ్యి ములగా పాడిగదా, పరగణా అంత భవంతి స్వంతానికి ఉందిగదా, అల్లాంటప్పుడు తనవేళకి తనయింటో, తనసొమ్ము — ఇతరులకి పెట్టద్దు పోనీ! — తను తింటూ ఉండిపోతే రోజులు దొర్లిపోవూ! దేవాసురులుకూడా ఎగిరి గంతెయ్యరూ! మరె! ఆవిడ అల్లా ఉంటుంది! రమ్మంది, తిమ్మన్నబంతికి! అల్లాంటివాళ్లు అల్లా ఉంటే కావలిసిందేమిటిహ! అపూర్వమైన

స్వంతపైత్యం ఏదో ఓటి వీథిని పడాలి, వ్యక్తిత్వంలో ఉండే ప్రత్యేకత స్థాపన కావాలి. అందుకని, అంత నిప్పులాంటి మనిషీ ప్రజలనోట పడింది.

ఇంట్లో పనున్నప్పుడు తప్ప ఆవిడ తన వీథి అరుగు — ఎడంవేపుది వదిలేదికాదు. ఇల్లెంతున్నా యజమానికి, ఇంట్లో ఒక్కొక్కస్థలం మరీ స్వస్థలంలా కనిపిస్తూండి, అక్కడికి చేరుకుంటేనేగాని మనస్సు స్థాయీపడదు. రాత్రెళ్లకూడా చాలాభాగం ఆవిడ అరుగునే ఆశ్రయించేది. కాని, ఆవిడకల్లో సరే సరి, నిద్దట్లోకూడా ప్రసంగిస్తూనే ఉండేది. ఇక, ఉత్తప్పుడు అడిగారూ! పైగా, పక్కని ఎవరో కళ్లల్లో వత్తులెట్టుగుని ఊకడుతూ కూచున్నట్టు, సంబోధనలుకూడా చేస్తూండేది. అయితేంగాక, ఇంతమాత్రాన్నే జనానికి కోపం రాలేదు. వాళ్లు ఆవిణ్ణి, 'వాగుడుకాయి' అనీ, ఇంకా పొట్టిచేసి, 'వాక్కాయి' అనీ ఆవిడ పరోక్షంలో వ్యవహరించేవారు, తీరిపోయేది. కాని, అభ్యాసంవల్లా నిర్భయత్వంవల్లా ఆవిడధోరణి క్రమేపీ తిట్లల్లో పడింది. కొంతకాలానికి ఎల్లా దిగిందీ! వీథమ్మట చరాచరాల్లో ఎవళ్లైనా సరే ఏదేనా సరే, నడవ భయం వెళ్ల భయం, ఉత్తపుణ్యానికి ఆవిడ దులిపి ఝాడించి పారేసేది. పైగా వెధవకర్మం! తన వేడివేడి విమర్శని ఒక్కరవ్వ చల్లారనిచ్చి, దానికి కొంచెం వార్నీసు వెయ్యడంగాని దాన్ని ఎల్లానో సాఫు చెయ్యడంగాని లేకుండానే ఆపళంగానే ఎదరపార్టీ మొహంమీద గిరవటెట్టేది. అక్కణ్ణించి క్రిమినలంతపని జరుగుతూండేది. ఆవిడ వంకలేనిమనిషి అవడంవల్లా, ఆడది అవడంవల్లా, సులువుగా తిట్టడంలో సార్వీసు ఉన్నదవడంవల్లా, కోపం హెచ్చినకొద్దీ నోటిధాటీ జోరు చెయ్యగలశక్తికలది అవడంవల్లా, విజయం ఆవిడికే దక్కుతూండేది. 'నోటిధాటీ' అంటే అదేదో జపానుసరుకు అనుకోకండి మరి! అప్పట్లో జనం బొత్తిగా పాపిష్టులు కాకపోడంవల్ల ఆవిడికి సంగీతం మట్టుకి అబ్బలేదు గాని ఆవిడిది గబళిశారీరం, త్రిస్థాయి గాత్రం, మందకొడివాళ్ల మనోవేగానికి రెట్టింపుగా ఉండే వాగ్వేగం. ఆవిడ కేకతో, పిల్లి పాలు తాగడం, కాకి వాలడం, మరిచిపోతే, చావమా! తోక ముడుచుగోండే కుక్కలు ఆవీథిని వెళ్లేవి కావంటే, చూసుగోండి మరి ఆవిడప్రజ్ఞ! ఒకసారి పరుగుమీద వస్తూన్న ఆంబోతుని ఆవిడ తిట్టి మళ్లేసిన సంగతి ఎరుగున్నవాళ్లున్నారు. మరోమాటు, ఒక పెద్ద రౌడీలాంటి మీసాల్దారు తనకి భయం ఏమిటనుకుని ఆవీథిని ఓ కిర్రుజోడు తొడుక్కుని కిల్లీ ఉమ్ముకుంటూ వెడుతూంటే, ఆవిడికి చికాకేసి, 'నీమీసాల కిర్రు మండిరి గదరా, నీ ఉమ్ము అంటించిరి గదరా!' అని జమిలిగా తిట్టేసరికి, అంతెత్తు మనిషీ నిలవా లేక, అడుగూ సాక్క, మాటా తోచక కేవలం 'సేమియా' అయిపోయాడని చెబుతారు. అక్కణ్ణించి, ఆవిడ ఎదటపడి ఆగలేని అసమర్థులంతా ఆవిడమీద అసూయ పెంచుగుని, ఆవిడతిట్లనిగురించి చాటుగా ప్రచారం మొదలెట్టారు. సిమాలమ్మ తిట్టడపుప్రజ్ఞ దేశంలో మోగిపోయింది. ఆవిడికి అదోహ జబ్బు అని చాలామంది అన్నారు. ఆవిడికి ఆ జబ్బు కుదిర్చి ఖర్చులేని దేశోపకారం టూకీగా చేసేసి పీతైసంతపేరు లాగాలని

కొందరు యత్నం చేశారు. మంచిదో చెడ్డదో ఏదో ఓ పేరు గలవాణ్ణి తిట్టడమో, అథవా వాడిచేత తిట్టించుగోడమో జరిగితే, తమరికిగూడా అమాంతంగా కొంత పేరేనా సుళువుగా వస్తుందని భ్రమించేజనం ఉంటారు. ప్రస్తుతం పోటీ తిట్లపోటీగనక ప్రతీవాడూ అభ్యర్థిగా నిల్చి చూశాడు. తిట్టుకి తొంభై దాకా తిట్టాలేమోగనక గట్టివాళ్లుకూడా కొందరు చొరబడ్డారు. ఉపన్యాసకులు, ఉపాధ్యాయులు, వాదులు, విదూషకులు, పురోహితులు వక్తలు, కవులు, ఆవిణ్ణి మించాలని వెళ్లేవారుగాని, ఆవిడే మరినాలుగాకులు ఎక్కువ చదివేది. బళ్లవాళ్లూ, బండపని చేసేవాళ్లూ, కోపంవచ్చిన పోలీసులూకూడా ఆవిడ తిట్టినంత సభ్యంగానూ స్వచ్ఛంగానూ తిట్టలేక తమ అపజయం ఒప్పేసుగున్నారు. తెరవెనకనించి ఉరిమినట్టు జంతువుల్లాగ కుయ్యగల ఒకరిద్దరు ముతగరకపు విద్యార్థులకికూడా ఆవిడయెదుట నోరు లేవలేదు. కొంతమంది గడేకార్లూ, చిలక్కొట్లూ, ఏజెంట్లూ, జప్తులవాళ్లూ, వసూళ్లవాళ్లూ కూడా ప్రయత్నించి, ఆవిడతిట్లప్రవాహంలో మొదట కొట్టుకుపోయి, మధ్య ములిగిపోయి, చివరకి తేలిపోయారు. 'హరి' అనే వరకూ ఆవిడిదే పైచెయ్యిగావును — (కాదు! పైనోరు గావును) — ఆవిడప్రభ అల్లా వెలగవలిసిందేగావును, ఆవిడజాతకం అల్లాంటిది గావును, తిట్టగలవాళ్లది రాజ్యంగావును, అనుకుంటూ లోకులు నిరాశలో పడిపోయారు.

కాలం జరిగింది. జరక్కుండా కూచోంది అదొక్కటేగా! ఆవిడిమీది కంట్రకత్వం పండింది. ఆవిడికి కుంచం నిండింది. ఒకనాడు పొద్దున్న తొమ్మిదింటికి ఆవిడ అరుగుమీద చతికిలబడింది. క్రితంనాడు పక్కఊరు తీర్థాని కెళ్లి రాత్రిరి ఇంటికి చేరుకునేసరికి ఆవిడికి పులకారం వచ్చినట్టుండి వొళ్లంతా పచ్చిపుండైంది. ఉదయం అపీషూ లేచి, అత్తీసరు పడేసి, తరవాత ఏదో యింత వడియాలపచ్చిపులుసు చేసుగోవచ్చుకదా అనుకుని, మడిగానే ఆవిడ అరుగుమీదికి వచ్చింది ఒక ఎరకలాడు ఆవీథంట వచ్చాడు. వాడు, మొలకి గోణం, తలకి పొణకంత పాగా, చెవలకి తమ్మెట్లూ, ఎడంచెవికి బావిలీ, ముక్కుకి కాడా, చేతులికి వెండిమురుగులూ, కుడిదండకి కడియం, చేతులో నక్కపిల్లికర్రా, జనపనారతాడు చుట్టా, నోట్లో రూళ్లకర్రంత ఉండి వెంటిలాగ రాజుతూన్న పొగచుట్టా, మీసాల చెప్పులూ వగైరాతో మహా అట్టహాసంగా వచ్చాడు. ఒక విశేషం. వాడిచుట్ట రొండుమూడునెల్లు వరసని కాల్చుగునేబాపతుది. దానిపొడుగుమూలాన్ని అది వాలిపోయి, జ్వాలాతోరణంలా ఒకసారే తగులబడిపోకుండా, వాడు దానిమధ్య ఒకనులకతాడు ముడేసి, నోట్లో ప్రతిష్ఠించినప్పుడు అది మట్టంగా ఉండేలాగు ఆతాడు అవతలకొస పట్టిగెల్లి తలపాగాకొంగుకి కట్టేశాడు. పళ్లగంపచుట్టూ మూగినట్టు జనం వాణ్ణి మూగి కొందరూ, వెంటాడించి కొందరూ వచ్చారు. సిమాలమ్మకి కొంచెం ఆశ్చర్యంవేసింది — "ఎవడ్రా! ఇన్నాళ్లకి ఇల్లా తెగించి రాగలిగాడూ!" అని. కాని, అల్లాంటివాణ్ణి తిట్టి, సాగనంపగలిగితేనే తన వాగ్జన్మకి సాఫల్యం అనిన్నీ, అంతగొప్పతరుణంలాంటిది మళ్లీ మళ్లీ తనకి దొరకకపోవచ్చనిన్నీ, ఆవిడికి

అనిపించి, ఆవిడ తనమనస్సులో ఉన్న తిట్ల దస్త్రాలు తిరగేసి, కొన్ని ముఖ్యమైనతిట్లు కేటాయించి ఏరి, నూరి, చిన్నచిన్న కట్టలుగా కట్టి, ప్రయోగించడానికి తగ్గస్థితిలో పెట్టింది. వాడు ఆవిడఇల్లు సమీపించాడు. అసలు వాడు తాడిచెట్టులో సహం ఉన్నాడు. వాడికర్ర వాడు సిటాగ్గా పట్టుగున్నప్పుడు అది వాణ్ణి దాటిపోయి, తాడిదన్నే వాడి తలదన్నే వాణ్ణి జ్ఞాపకంచేసింది. వాడు వచ్చేసి సరసరా ఆవిడింటిగుమ్మాలు ఎక్కేశాడు. వొర్థి కిరాతపుముండావాడొచ్చాడే అనుకుని ఆవిడ కొద్దిగా నిర్ఘాంతపోయి లేచి నిలబడి దవడలు నొక్కుగుని, "అయ్యో! అజ్జో! అచ్చో! నీతాడు తెగా, నీదుంప తెంపా, నీవేరు తవ్వా! నేను మనిషి ననుకున్నావా, పంది ననుకున్నావురా, నిం దగలెయ్యా!" అని ప్రారంభోపన్యాసం ఇచ్చింది. వాడు గడపదాకా ఎక్కి, అక్కడ ఆగి, తనమూతి పైకి ఎత్తిపట్టి, చుట్ట తీసి, "థ్ఫూ" అనే పెద్దశబ్దంతో ఇంట్లో పడేలాగు కడవంత ఉమ్మేసి, వీథికేసి తిరిగి, చుట్ట మళ్లీ నోట్లో స్థాపించి, నులకతాడు బిగించి, గుమ్మంమీద కూచున్నాడు సిమాలమ్మ, నడుం బిగించి,పళ్లు బిగించి, చేతుల్తో గాల్ని పొడుస్తూ కొంచెం వడిగా, "ఓరివెథవా, వెథవన్నరా! కుంకా! దోయంకుంకా! కుంకాక్షీ! చెవలవెథవా, చెవుల్తెగిన వెథవా! మరీ పొయ్యకాలం వచ్చిందేంరా! హోమం చెయిస్తా! నీకొవ్వాండిస్తా! నీపొగరు తీయిస్తా! అమ్మవెథవపొగరా!"...

అంటూ కాస్త దార్లోపడుతూండేసరికి, ఎరకలాడు ఛంగున గద్దిగాడులాగ ఆవిడ మొదట ఓగజం ఎడంలోకి గంతేసి వాలి, చుట్ట తీసి పట్టుగుని, ఒక గొప్ప మేఘమండలం నోట్లోంచి బల్లపరుపుగా ఊది, ఆవిడికి నిర్మోహమాటంగా ప్రత్యక్షదానం చేసి, మళ్లీ వెళ్లి గడపమీద కూచున్నాడు. ఆ పొగతో ఉక్కిరి బిక్కిరి అయి, ధూపం వేసినట్టు అయి, అరికాలిమంట నెత్తికెక్కి ఆవిడ తేనెపట్టులా రేగిపోయింది. అది లగాయతు, ఆవిడ ప్రతితిట్టుముక్కకీ, మడమలు ఎగరెయ్యడం, చేతులు చాచి చేతిగూళ్లు గిరగిరా తిరిగేలాగు నిలువుపాటంలో బండిచక్రాలులాంటి సున్నలు చుట్టడం, ముందుకీ వెనక్కీ ఊగడం, తల ఎకరకి విసరడం, విడవకుండా చేస్తూ, అచ్చంగా అయోమయపు గిన్నెలకి చక్రం తిప్పేమనిషి అవస్థలో పడింది.

వాడు తలపాగాలోంచి అద్దం ఓటి పైకి తీసి, నవ్వుకుంటూ, తన మొహంయొక్క అందానికి మురిసిపోతూ, పెదిమిలికి ఒక ఐమూల ఉన్నచుట్ట దానంతట అదే పళ్ల మీద నృత్యం చేస్తూ అవతల ఐమూలకి చేరేటట్టు కదుపుతూ, తన పెదిమిలయొక్క పనివాడితనం చూసుగుంటున్నాడు.

సిమాలమ్మ — (ఒక్కతిట్టుకే పైన చెప్పిన చేష్టలన్నీ చేస్తూ, వాడి మొహం మీద కోపంవచ్చి) ఓరి నీమొహంఈడ్చా, నీమొహం మండా, నీమొహం ఊరేగించా, నీమొహాన్ని జీడెట్టా, నీమొహం తగలెయ్యా, నీమొహం కాల్చా, నీమొహం గానుగాడా, నీమొహం ఛత్రంచెయ్యా, నీమొహం చిత్రికపట్టా, నీకళ్లు పేలా, నీగుడ్లు మాడా...

వాడు —(చుట్ట తప్పించి, కోతిలాగ పళ్లిగిలించి, దొరదెక్కినట్టు ముక్కూ వొళ్లూ గోక్కున్నాడు.)

సి — నీపళ్లు పీకా, నీగోళ్లు పెల్చా, నీ గోక్కోడం అంటించా, కొండ ముచ్చువెధవా, కోతివెధవా......

అంటూ ఆవిడ దొరకపుచ్చుగునే సరికి ఆసమయానికి ఓ ముష్టమ్మి, ఓకోతిని ఆడిస్తూ తీసుగొచ్చింది. ఎరకలాడు తలపాగాలోంచి ఓ అరిటిపండు తీసి దానికేసి గిరవ శేసి, ఇంకోటి కుడి అరుగుమీద పడేశాడు. తక్షణం ఆ కోతి గిరవశేసిన పండు పండట్టుగుని ఒక్క గంతులో కుడి అరుగుమీదికి ఎగిరి, అక్కడి పండు కుడా తీసుగుని తినేసి, మొగ్గలేసి, సిమాలమ్మ ఎల్లా ఎల్లా తిప్పుగుని ఏమేమి చేస్తే అల్లాఅల్లా తిప్పుగుని అది అది చేస్తూండడం మొదలెట్టింది. సిమాలమ్మకి కోపం జనానికి సంతోషం ఎక్కువైపోయాయి. ఇక ఎరకలాడు ఊరుకున్నప్పుడుకుడా, ఊరుకోకుండా ఆవిడ తిట్టేస్తోంది.

ఇంతలో వాడు ఆవిడకేసి చూసి నవ్వి, తనవేళ్లు, (కళ్లు మూసుగుంటూ), ముద్దెట్టుగున్నాడు.

సిమాలమ్మ — (గబగబా) నీకు అమ్మవారు రానూ, నీకు మహమ్మారి రానూ. నీకు ఏక్షెత్తురానూ, నీకు పెద్దరోగం రానూ, నువ్ మంచం అట్టా, నిన్ను పెద్దపాం పీకా, నిన్ను పులేసుగుపోనూ, నీమీద పిడుగడా, నిన్ను బలెయ్యా, నిన్ను తెగెయ్యా...

కోతిగుడా అంతవడిగానూ పెదిమిలు కదుపుతూ, కడంపన్లన్నీ చేసి చూపించింది. జనం చూస్తూ, వింటూ, కోలాహలంగా ఉన్నారు.

కాని, సిమాలమ్మకి మాట ఒక్కంటికి అన్నేసి చేష్టలు చేస్తూండడంవల్ల, క్రమేపీ మడమలు లేవడం మానేశాయి. కాస్సేపటికి చేతులు గూళ్లల్లో పట్లు తప్పిపోయాయి. మరి కాస్సేపట్లో మెడజీవాలు కూడా తోడుకుపోయాయి. అక్కడితో ఆవిడ చాలా పీలస్వరంలో తిట్టడం తప్ప, అభినయాల్లో ఒక్కటీ చెయ్యలేకపోయింది. ఆసందర్భంలో వాడు కుడి తర్జనితో తనకేసి చూపెట్టుగుని వెంటనే ఆవిడకేసి చూపించి, తర్జనీలు కలిపి చూపించాడు.

సి — (చాలా కోపంతో, అతివడిగా) నువ్వు చచ్చిపోనూ, నువ్వు రాలిపోనూ, నువ్వు కాలిపోనూ, నీకు నిచ్చిన కట్టా, నీకు సవ్వారికట్టా, నీకు పాడికట్టా, నీకు రాయికట్టా, నిన్ను మోసెయ్యా, నిన్ను తగలెయ్యా, నిన్ను పాతెయ్యా, నిన్ను పాతరెయ్యా, నిన్ను బారెట్టా, నిన్ను పురంవెయ్యా, నిన్ను బూడిద చెయ్యా, నీకు పన్నెండెట్టా, నీకు మాసికంపెట్టా, నీపిండం పిల్లులికెయ్యా, నీశార్థం చెట్టుకిందెట్టా...

అనేరకాలు కొన్ని సొంతంగా ప్రయోగించుగుంటూ చివరచివరకి రావడంలో, ఆవిడికి మాటకూడా పడిపోయింది. కళ్లు తెరిచిఉన్నాయి, నోట్లోంచీ, ముక్కుపోణాల్లోంచీ గాలిమాత్రం వస్తోంది. మరేమీ

లేదు. అయినా ఎరకలాడు ఇంకోసారి చూద్దాం అనుకుని, బుగ్గని వేలెట్టుగుని తక్కుతూ, ఆవిడదగ్గిరిదాకా వెడుతూ వస్తూ బోగంఆట ఆడిచూశాడు. కోతికూడా అల్లానే చేసింది. కాని ఆవిడ ఎంతమాత్రం చేతా వాతాకాకుండాపోయి కేవలం అశక్తురాలై బొమ్మలాగ చూస్తూ ఉండిపోయింది.

గ్రంథం అంతవరకు రానిచ్చి, ఎరకలాడు, ఒక్కమాటంటే ఒక్కమాటే నోరు విప్పి, "నేను నీకు మంచి మొగుణ్ణి కానుటే" అంటూ ఆవిడకేసి చూసి సిగ్గు అభినయించాడు. ఈమాటతోటి, అస్ఖలితంగా బతికిన మనిషి గనక, సిమాలమ్మ తన అపజయం, పరాభవం, అవమానం, నిస్త్రాణ, నీరసం వగైరాలవల్ల గుప్పమని పెద్దపెట్టున అప్పుడు మళ్లీ పుట్టిన కోపంతో, ఊతం బలవంతం చేసుగుని, ఆఖరుమాటు చేతులు తిప్పుతూ ఆడిపోతూ కసితీరా వాణ్ణి తిట్టాలనుకుని, చేతులు చాచి, "ఓరి నీనోరు పడోవ్" అనడానికి ప్రయత్నించడంలో, గూళ్లు పట్టుతప్పి పోవడంవల్ల ఎల్లానో చాచినచేతులు అల్లానే ఉండిపోయాయి గాని మరి కిందికి రాలేదు, మాటలు అనడాకిని తెరిచిన నోరు అంకిళ్లు పట్లు వొదిలిపోడంవల్ల ఎల్లానో ఆమాటలు అనేసి, తరవాత అల్లానే ఉండిపోయింది గాని దగ్గిరపడలేదు. ఒక్కక్షణం ఆస్థితిలో నిల్చిపోయి, చెయ్యీ దవడా స్వాధీనం తప్పిపోడం ఆవిడకి బాగా గుష్టుకి రాగానే, ఆవిడ కుంగిపోయి పక్కకి పడిపోయింది.

జనానికీ ఎరకలాడికీ ఆవిడమీద అదివరకే బయల్దేరిన జాలి వెల్లివిరిసిపోయింది. ఎరకలాడు తనవైద్యం మరి కట్టేశాడు. అసలు వైద్యులొచ్చి ఆవిడ గూళ్లూ అంకిళ్లూ బాగుచేసి, మందిచ్చి, ఉపచారాలు చెయించగా, ఆవిడ ఓ వారంరోజుల్లో లేచింది. ఎరకలాడివేషం వేసిన ఆయనకీ, ముష్టిఅమ్మివేషంలో కోతిని తీసుగొచ్చిన అతని తమ్ముడికీ వాగ్దానప్రకారం ఆ ఊరి జమీందారుగారు సిమాలమ్మధర్మమా అని ఓ అగ్రహారం ఇచ్చారు. సిమాలమ్మ తనఆస్తికూడా తనఅనంతరం వాళ్లకి చెందేటట్టు రాసేసింది.

తరవాత సిమాలమ్మగారు, తను జీవించిన పదికాలాలపాటూ, ఇల్లా నోరు విప్పి ఎరగదుట, నోరు విప్పగా ఎవ్వరూ వినలేదుట. ఆవిడమాట మానుకున్న అనంతరం ఆవిడ మాటలు వినాలని వేలాదిగా జనం వచ్చేవారుట. ఆవిడ గొప్ప జ్ఞానురాలనీ, ఆలోచనపరురాలనీ, కవయిత్రి అనీ జనం అప్పుడు కనిపెట్టి ఎంతో మెచ్చేవారుట.

"సారస్వతప్రౌఢిమార్థి...సురియ చేత
నాలుకఁ గోసికొని......యిష్టమొందు"
అని మన సూరన్న మాటలు

మాటలేనా!

—o—